సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం : 31 : జనవరి : 2024



పోచమ్మ తల్లికి బోనాలు

కోనరావుపేట: మండలం ఎగ్లాస్‌పూర్‌లో మంగళవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యం లో పోచమ్మకు బోనాలు సమర్పించారు.



గోదావరి ప్రాణగుండాలు

ధర్మపురి గోదావరి వద్ద నీటిమట్టం తగ్గుతోంది. పుణ్యస్నానం కోసం వెళ్తున్నవారు జర భద్రం. ఎందుకంటే పై ప్రాంతాల్లో ప్రమాదకర గుండాలున్నాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/18.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. సాయంత్రం చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి యోగా పోటీలకు విష్ణుప్రసాద్



యోగా ప్రదర్శనలో విష్ణుప్రసాద్

సిరిసిల్లటౌన్: జాతీయస్థాయి యోగా పోటీలకు సిరిసిల్లకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థి స్వర్గం విష్ణుప్రసాద్ ఎంపికయ్యాడు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విష్ణుప్రసాద్ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభచూపాడు. ఫిబ్రవరి 1నుంచి రాజస్తాన్‌లోని జైపూర్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటాడు. ఈసందర్భంగా విద్యార్థిని డీఈవో రమేశ్‌కుమార్, డీవైఎస్‌వో రాందాస్, ఎస్జీఎఫ్ సెక్రటరీ దేవత ప్రభాకర్, హెచ్‌ఎం చకినాల శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఉప్పల శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఐఈవో మోహన్

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వ రంగ విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చింతల మోహన్ అన్నారు. గెజిటెడ్ లెక్చరర్ల సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలల్లో ఉండే విద్యార్థులకు మానవతా దృక్పథంతో విద్యాసేవలు అందించాలన్నారు. ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. సంఘం నేతలు సుంకపాక నాంపల్లి, సామల వివేకానంద్, రమేశ్‌బాబు, దేవయ్య, రాజేశ్వరరావు, రాజయ్య, చంద్రమౌళి, పాపారావు, గజానంద్, రాజు, గంగరాజు, మురళి పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



సమావేశంలో ట్రేడ్ యూనియన్స్ నాయకులు

సిరిసిల్లటౌన్: పోరాటాలతోనే కార్మిక, కర్షకుల సమస్యలు పరిష్కారం అవుతాయని జాయింట్ ప్లాట్‌ఫామ్స్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్మికులు, కర్షకుల సమస్యలపై మంగళవారం సిరిసిల్ల కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాయడం, మతతత్వాన్ని పెంచి పోషించడం మూలంగా ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందన్నారు. పదేళ్లుగా మోదీ సర్కారు సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని పేర్కొన్నారు. కార్మికులు, వ్యవసాయ చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేసిన బీజేపీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పాలని కోరారు. ఈమేరకు దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న చేపట్టే సమ్మెకు అన్నివర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. నాయకులు కడారి రాములు, కోడం రమణ, మీసం లక్ష్మణ్, శంకర్, పోచమల్లు, శ్రీనివాస్, రాజు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ లేని సమాజమే లక్ష్యం



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న వేణు

ముస్తాబాద్(సిరిసిల్ల): దోపిడీ, పీడన లేని సమ సమాజమే లక్ష్యంగా సీపీఐ పనిచేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ముస్తాబాద్, పోతుగల్ గ్రామాల్లో సీపీఐ సభ్యత్వ నమోదును మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. సీపీఐ సభ్యత్వ నమోదు ఏటా జనవరిలో చేపడుతామని పేర్కొన్నారు. జిల్లాలో ఈయేడు అన్ని గ్రామాల్లో చేపట్టడం జరుగుతుందన్నారు. గత బీఆర్‌ఎస్ పాలకులు అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను సీపీఐ చైతన్యవంతులను చేసి నిలదీసిందన్నారు. అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరు గ్యారంటీల అమలుకు ప్రజల తరఫున ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మిద్దె నర్సయ్య, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నాగరాజు పాల్గొన్నారు.

రూ.500కే సిలిండర్ కావాలి

- 'ప్రజాపాలన' దరఖాస్తుల్లో అగ్రస్థానం
- సిలిండర్ల కోసం 1,65,278 అర్జీలు
- గ్యారంటీల దరఖాస్తులన్నీ ఆన్‌లైన్
- తేలిన లెక్కలు.. అమలుపై ఆశలు



ప్రజాపాలన సభలో దరఖాస్తులు ఇస్తున్న మహిళలు(ఫైల్)



సిరిసిల్ల: 'ప్రజాపాలన' సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి 25 రోజులు పూర్తి అయింది. జిల్లావ్యాప్తంగా 1,92,617 దరఖాస్తులు రాగా.. ఎక్కువ మంది తమకు రూ.500కే సిలిండర్ కావాలనే దరఖాస్తులు ఇచ్చారు. 'మహాలక్ష్మీ' పథకంలో భాగంగా రూ.500కే సిలిండర్ పథకానికి 1,65,278 మంది మహిళలు దరఖాస్తు చేయడం విశేషం. మొత్తం దరఖాస్తుల్లో సిలిండర్ రాయితీ కోసం 85.80 శాతం దరఖాస్తులు వచ్చాయి. రెండో స్థానంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 1,42,966 అర్జీలు రాగా, మూడో స్థానంలో మహిళలకు ×మహాలక్ష్మీ₹ పథకంలో ఇచ్చే రూ.2500 పెన్షన్ కోసం 1,28,549 దరఖాస్తులు వచ్చాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలనకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లాలోని 255 గ్రామాలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లోని 67 వార్డుల్లో సభలు నిర్వహించి అర్జీలు స్వీకరించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును ఇప్పటికే అధికారులు యుద్ధప్రాతిపదికన ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

జిల్లాలో ఆరు గ్యారంటీలకు వచ్చిన దరఖాస్తులు

మహాలక్ష్మీ (గ్యాస్ సిలిండర్)	: 1,65,278
200 యూనిట్ల ఉచిత విద్యుత్	: 1,42,966
మహాలక్ష్మీ (రూ.2,500 పెన్షన్)	: 1,28,549
ఇందిరమ్మ ఇళ్ల కోసం	: 1,10,198
రైతు భరోసా (ఎకరాకు రూ.15వేలు)	: 69,723
అన్ని రకాల పెన్షన్లు	: 76,501
వ్యవసాయ కూలీలు (రూ.12వేలు)	: 76,953
ఉద్యమకారులకు (అమరులకు) ఇంటి స్థలం	: 2,468

జిల్లాలో మండలాలవారీగా వచ్చిన దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు
బోయినపల్లి	12,808
చందుర్తి	11,737
ఇల్లంతకుంట	16,598
గంభీరావుపేట	15,567
కోనరావుపేట	14,802
ముస్తాబాద్	16,127
రుద్రంగి	5,404
తంగళ్లపల్లి	16,766
వీర్నపల్లి	4,741
వేములవాడ	7,854
వేములవాడరూరల్	8,050
ఎల్లారెడ్డిపేట	17,030
సిరిసిల్ల మున్సిపల్	30,146
వేములవాడ మున్సిపల్	14,987

గ్యారంటీలపై ఆశలు

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో జిల్లాలో ఆరు గ్యారంటీలపై ఆశలు చిగురించాయి. ఇప్పటికే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు దాటింది. దీంతో ఎవరిని అర్హులుగా గుర్తించి పథకాలను అందిస్తారనే ఉత్కంఠ నెలకొంది. అన్ని వర్గాల వారి నుంచి దరఖాస్తులను ప్రజాపాలనలో స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కానీ లబ్ధిదారుల ఎంపిక, అర్హతలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు. ఇప్పటికే మహిళలకు మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు సాగుతున్నాయి. ఈ పథకంలో జిల్లాలో పది లక్షల మంది ప్రయాణించినట్లు ఆర్టీసీ గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో 1.49 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. ప్రతి నెలా 48,213 సిలిండర్లు రీఫిల్లింగ్ అవుతున్నాయి. సిలిండర్‌ను రూ.500లకే సరఫరా చేయడం ద్వారా ప్రతి నెలా రూ.2.30 కోట్ల మేరకు ఆదా అవుతుందనే అంచనా. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ రీఫిల్లింగ్ ధర రూ.1,100 ఉంది.

తేలిన లెక్కలు

జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తుల లెక్కలు పక్కాగా తేలడంతో ఆయా పథకాలపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచి ఉచిత వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఇంకా కొత్త రేషన్‌కార్డులు, కౌలు రైతులకు ఆర్థికసాయం, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, అమరవీరుల కుటుంబాలకు ఆర్థికసాయం వంటి పథకాలపై ఆశలు పెట్టుకున్నారు. పెన్షన్ పథకాల మొత్తాన్ని పెంచడంపైనా దివ్యాంగులు, వృద్ధులు ఆశగా చూస్తున్నారు. ఇప్పటికే పెన్షన్ పొందుతున్న వారితో పాటు కొత్త పెన్షన్ కోసం దరఖాస్తులు ఇచ్చినవారు, ప్రజాపాలనపై నమ్మకంతో ఆయా పథకాలకు దరఖాస్తు చేసినవారు ప్రభుత్వ సాయం కోసం నిరీక్షిస్తున్నారు.



రాజన్న క్షేత్రంలో సప్తస్వర ఝరి

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో జరుగుతున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వర్ణలత బృందం సంగీత కచేరి సభికులను ఆకట్టుకుంది. రాజన్న క్షేత్రంలో ఐదు రోజులపాటు సప్తస్వరి ఝరి వినిపించనుంది. 8లో▸

అమరుల ఆశయాలు సాధించాలి



నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్లు గౌతమి, ఖీమ్యానాయక్ తదితరులు

సిరిసిల్ల: స్వాతంత్ర్య ఉద్యమ సాధనలో ప్రాణాలను త్యాగం చేసిన అమరులకు కలెక్టరేట్‌లో మంగళవారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ మాట్లాడుతూ, ఏటా మహాత్మగాంధీ వర్ధంతి రోజున అమరులను స్మరించుకుంటూ నివాళి అర్పిస్తామన్నారు. అమరుల ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, కలెక్టరేట్ సెక్షన్ అధికారి శ్రీకాంత్, డీపీఆర్వో దశరథం, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వేసే విధానంపై అవగాహన అవసరం

ఈవీఎం, వీవీప్యాట్‌ల ద్వారా ఓటు వేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో మంగళవారం ఈవీఎం, వీవీప్యాట్‌ల అవగాహన ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వచ్చే వారికి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేయాలని సిబ్బందికి సూచించారు. 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ పాషా, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో అవినీతి జరిగినట్లు అధికారులు గుర్తించారు. మంగళవారం నిర్వహించిన ప్రజావేదికలో కార్యదర్శుల, ఫీల్డ్ అసిస్టెంట్ల నిధుల దుర్వినియోగం వివరాలు బయటపడ్డాయి. ఉపాధి పనులకు కూలీలు పనులకు హాజరుకాకున్నా వారి సంతకాలు ఫోర్జరీ చేసి కార్యదర్శులే నిధులు స్వాహా చేసినట్లు అధికారుల దృష్టికి రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో కలిపి రూ.11,836 రికవరీకి, రూ.11 వేల జరిమానా విధించారు. కాగా ప్రజావేదికకు పలు గ్రామాలకు చెందిన కూలీలు, మేట్లు హాజరుకాలేదు. కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే హాజరయ్యారు.

ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలి

ఉపాధి పనులను కార్యదర్శులు సక్రమంగా చేయించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. కోనరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉపాధిహామీ 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పనులు నిర్వహించాలన్నారు. డీఆర్డీ ఏపీడీ మదన్ మోహన్, విజిలెన్స్ అధికారి రామారావు, ఏపీడీ నర్సింహులు, ఎస్‌ఆర్పీ కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన విజేతలకు ఎస్పీ అభినందన



బహుమతులు అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లకల్చరల్: మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా మానేరు రచయితల సంఘం మంగళవారం గాంధీ జీవిత చరిత్ర అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించింది. పోటీల్లో తెలుగు విభాగం విజేతలకు ఎస్పీ అఖిల్ మహాజన్ బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి గీతానగర్ జెడ్పీ హెచ్‌ఎస్‌కు చెందిన సృజన, ద్వితీయ బహుమతి భవ్యశ్రీ, తృతీయ బహుమతి కె.రేణుక అందుకున్నారు. సృజనాత్మకతను పెంచుకుంటూ జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థులకు సూచించారు. మారసం ప్రతినిధులు ఎలగొండ రవి, ఆడెపు లక్ష్మణ్, బూర దేవానందం, చిటికెన కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు సతీశ్, నరేందర్, వెంకట్‌రాములు, తిరుపతి, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

నేడు పరుగు పోటీలు

సిరిసిల్లకల్చరల్: పాఠశాల స్థాయి విద్యార్థులకు బుధవారం సిరిసిల్ల మినీ స్టేడియంలో రన్నింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 14 ఏళ్ల లోపు విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తామని వివరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన 25 మందిని భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని అసోసియేషన్ కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పురపాలక సంఘం అత్యవసర సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎండీ ఆయాజ్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.15 గంటలకు కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ జిందం కళ అధ్యక్షతన జరుగుతుందని పేర్కొన్నారు.

భూ అక్రమార్కులపై ఉక్కుపాదం

- ఆధారాలతో ఫిర్యాదు వస్తే బాధ్యులపై చర్యలు
- కలెక్టర్, ఎస్పీ కఠిన చర్యలు తీసుకోవాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్



కలెక్టరేట్‌లో సమీక్షిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్



ముస్తాబాద్‌లో జెడ్పీటీసీ నర్సయ్యను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పొన్నం

సిరిసిల్ల: జిల్లాలో భూఅక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్, ఎస్పీ, రెవెన్యూ అధికారులను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం జిల్లా అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2014కు ముందు ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో ఉండి.. తర్వాత అన్యాక్రాంతం అయిన భూములపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

రాజకీయ పలుకుబడి, అధికారుల అండ, కండబలంతో కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో విద్యుత్ పంపిణీ సంస్థ 'సెస్'లో అక్రమాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని పేర్కొన్నారు. పవర్‌లూమ్ యూనిట్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేయొద్దని, ప్రభుత్వమే వారికి బకాయి ఉందని, డబ్బులు రాగానే చెల్లిస్తారని 'సెస్' ఎండీకి మంత్రి సూచించారు.

నేతన్నలకు అండగా..

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, నేతన్నలకు వెన్నుదన్నుగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. వస్త్ర తయారీకి అవసరమైన యార్న్‌ను ప్రభుత్వమే సరఫరా చేయనుందని, వర్కర్ టు ఓనర్ పథకానికి లబ్ధిదారులను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. టెక్స్‌టైల్ పార్క్ సమస్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను కోరారు. సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీవోలు ఆనంద్, మధుసూదన్, డీఎఫ్‌వో బాలమణి, డీపీవో రవీందర్, డీఆర్‌డీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే స్వేచ్ఛా ప్రజాస్వామ్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): బీఆర్‌ఎస్ హయాంలో మంత్రులు పర్యటిస్తే కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య బద్ధంగా అందరినీ సమానంగా చూస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముస్తాబాద్ మాతృశ్రీ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ జెడ్పీటీసీ గుండం నర్సయ్య, విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు, నాయకులు మంగళవారం కాంగ్రెస్‌లో చేరగా, వారికి మంత్రి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జీ మహేందర్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ మంచి పథకాలు అమలు చేస్తున్న నేపథ్యంలో వేలాది మంది పార్టీలోకి వస్తున్నారని వివరించారు. మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, బుర్ర రాములు, పెద్దిగారి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు. కాగా జెడ్పీటీసీ నర్సయ్య, విండో చైర్మన్, డైరెక్టర్లు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు, వెంకట్రావుపల్లె, మొర్రాపూర్, సేవాలాల్‌తండా, గన్నెవారిపల్లె, గోపాల్‌పల్లె సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, తదితరులు వెయ్యి మంది వరకు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్రంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని రాజన్నపేటలో రూ.33 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్ ముక్క శంకర్‌తో కలిసి ప్రారంభించారు. దుమాలలో ప్రగతి ప్రాంగణ భవనం, హైస్కూల్ ప్రహరీ, టాయిలెట్స్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం రాగట్లపల్లిలో ప్రైమరీ స్కూల్ భవనాన్ని సర్పంచ్ దాసరి సుజాతతో కలిసి ప్రారంభించారు. ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో దాదాపు 100 మంది కాంగ్రెస్‌లో చేరారు. దుమాల సర్పంచ్ కదిరె రజిత, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్ కృష్ణారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని కోళ్లమద్దిలో రూ.20లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, గంభీరావుపేటలో రూ.19.55లక్షలతో నిర్మించిన వ్యాపార దుకాణాల సముదాయాన్ని మంత్రి ప్రభాకర్ ప్రారంభించారు. టీఆర్‌టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించారు. గంభీరావుపేటలో అంబేడ్కర్ సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సంఘ సభ్యులు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. అలాగే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు మంత్రికి వినతిపత్రం అందజేశారు. కాగా గంభీరావుపేట సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, ముచ్చర్ల ఉపసర్పంచ్ వంగ రాఘవేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమాల్లో కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ తదితరులు పాల్గొన్నారు.

'పెద్దింటి' పెండ్లి పాట విడుదల



పాటను విడుదల చేస్తున్న శేఖర్ కమ్ముల

సిరిసిల్ల: జిల్లాకు చెందిన కథకుడు, సినీ మాటలు, పాటల రచయిత పెద్దింటి అశోక్‌కుమార్ రాసిన పెండ్లి పాటను ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల మంగళవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. యువనటుడు చైతన్య, నటి భూమిశెట్టి జంటగా నటించిన 'షరతులు వర్తిస్తాయి' సినిమాలో పెండ్లి పాటను అశోక్‌కుమార్ రాశారు. దీనికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. గతంలో ఎన్నో సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన అక్షర కుమార్ తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా వచ్చే నెలలో రిలీజ్ కానుంది. తెలంగాణ పెళ్లిలలో జరిగే ప్రతి ఈవెంట్‌ను చూపిస్తూ పల్లె సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా పాట సాగుతుంది. ఇది ఒక కొత్త ఒరవడి అని సినీ విమర్శకులు అభిప్రాయపడ్డారు. పాట రచయిత అశోక్‌కుమార్‌ను పలువురు సినీ ప్రముఖులు అభినందించారు.

గొర్రెల డబ్బులు వాపస్ ఇవ్వండి

బోయినపల్లి(చొప్పదండి): గొర్రెల ప్రత్యేక అభివృద్ధి పథకానికి సంబంధించి వాటా డబ్బులు వాపస్ ఇవ్వాలని మండలంలోని వరదవెల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు మంగళవారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీఏ కొమురయ్యకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం గొర్రెల పంపిణీ లేనందున చెల్లించిన వాటా డీడీ డబ్బులు తిరిగి తమకు ఇవ్వాలని, లేదా గొర్రెలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో నిట్టు వెంకటేశం, గుంటి మహేశ్, గొట్ల వెంకటేశం, ఏనుగుల శ్రీని వాస్, బీర్ల కొండయ్య, నిట్టు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కరీంనగర్ జిల్లాస్థాయి రగ్బీ పోటీలు



శంకరపట్నం(మానకొండూర్): తాడికల్‌లో రగ్బీ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు టి.చిరంజీవి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్ –14 బాలబాలికల పోటీలను మంగళవారం నిర్వహించారు. వీణవంక, హుజూరాబాద్, మానకొండూర్, కరీంనగర్, శంకరపట్నం మండలాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైనవారు యాదాద్రి భువనగిరి జిల్లాలో ఫిబ్రవరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

నామాపూర్ సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి సస్పెన్షన్

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని నామాపూర్ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సంతోష్, జీపీ కార్యదర్శి తిరుపతిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ యాస్మిన్‌బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీవో మహేందర్ తెలిపారు. గ్రామంలో స్వచ్ఛంద సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన బోరుబావులతోపాటు ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో బిగించిన హైమాస్ట్ లైట్లకు గ్రామ పంచాయతీ నుంచి నిధులు డ్రా చేసి, దుర్వినియోగం చేశారని గ్రామానికే చెందిన ముదిగంటి పవన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీవో కనకదుర్గ ఇటీవల విచారణ జరిపి, కలెక్టర్‌కు నివేదిక అందించడంతో ఆ ముగ్గురిపై తాత్కాలికంగా సస్పెన్షన్ వేటు వేసినట్లు ఎంపీవో పేర్కొన్నారు.

'అర్చక' క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడి నియామకం



మాధవాచార్యులు


కథలాపూర్(వేములవాడ): మండలంలోని గంభీర్‌పూర్‌కు చెందిన అర్చకుడు ఓరుగంటి మాధవాచార్యులు ధూపదీప నైవేద్య అర్చక సంఘం క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాధవాచార్యులు ప్రస్తుతం సంఘం జిల్లా అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.

రైస్‌మిల్లులో పేలిన బాయిలర్

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులోని గోపికృష్ణ ఇండస్ట్రీస్‌లో బాయిలర్ పేలింది. స్థానికుల వివరాల ప్రకారం.. రైస్‌మిల్లులో ధాన్యం ఉడకబెట్టే బాయిలర్ మంగళవారం ప్రమాదవశాత్తు పేలింది. ఆ సమయంలో అక్కడ మిల్లు కార్మికులు లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. కాగా, ఈ ప్రమాదంలో గోదాం, ఊక రూం కూలిపోయాయని, సుమారు రూ.70 లక్షల వరకు నష్టం వాటిల్లిందని యజమాని సాగర్‌రావు తెలిపారు. విషయం తెలుసుకున్న రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులు తిరుపతిరెడ్డి, నగునూరి అశోక్, పురుషోత్తంరావు తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

గోదావరిలో ప్రాణగుండాలు

- ఎగువ ప్రాంతాల్లో 5 గుండాలు
- సత్యవతి, బ్రహ్మ అతి ప్రమాదకరం
- పుణ్యస్నానాలకు వెళ్లి గతంలో ఎంతోమంది మృతి
- ధర్మపురి వద్ద తగ్గుముఖం పట్టిన నీటిమట్టం
- ప్రమాద సూచికలు ఏర్పాటు చేయని వైనం



ప్రమాదకర గుండాల వద్ద స్నానం చేస్తున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి గోదావరి వద్ద నీటిమట్టం తగ్గుతోంది. పుణ్యస్నానం కోసం వెళ్తున్నవారు జర భద్రం. ఎందుకంటే పై ప్రాంతాల్లో ప్రమాదకర గుండాలున్నాయి. లోతు తెలుసుకోకుండా వెళ్లిన ఎంతోమందిని అవి మింగేశాయి. వారి కుటుంబాలకు కడుపుకోత మిగిలింది. ఏటా వేసవి సమీపిస్తే చాలు గోదావరి నీటిమట్టం తగ్గుతుంది. భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు ఎగువ ప్రాంతాలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం.

దక్షిణ కాశీగా పేరు..

జగిత్యాల జిల్లాలోని ధర్మపురిని దక్షిణ కాశీగా పిలుస్తుంటారు. ఇది ఒక ప్రాచీన పుణ్యక్షేత్రం. ఇక్కడ లక్ష్మీనృసింహస్వామితోపాటు పవిత్ర గోదావరి ఉంది. నది దక్షిణ ముఖంగా ప్రవహించడంతో దక్షిణ కాశీగా పేరొచ్చింది. ఇందులో స్నానం చేస్తే కాశీలో చేసినంత పుణ్యఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే, ఈ క్షేత్రానికి నిత్యం మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది వస్తుంటారు. ముందుగా గోదావరిలో స్నానం చేసి, స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ.

ఎల్లంపల్లి బ్యాక్ వాటర్..

ధర్మపురి గోదావరిలో సత్యవతి, బ్రహ్మ, యమ, పాల, చక్ర గుండాలున్నాయి. వీటిలో అతి ప్రమాదకరమైనవి సత్యవతి, బ్రహ్మగుండాలు. ఇవి అతి లోతైన ప్రదేశాలు. ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌తో ఏడాదిలో 8 నెలలపాటు గోదావరి నిండుకుండను తలపిస్తూ పుష్కరఘాట్లను ఆనుకొని పారుతుంది. దీంతో భక్తులు ఎగువ ప్రాంతాలకు వెళ్లలేక పుష్కరఘాట్ల వద్దే పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. ప్రస్తుతం వేసవి సమీపిస్తుండటంతో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. దీంతో భక్తులు తమ కుటుంబసభ్యులతో కలిసి స్నానాల కోసం ఎగువ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇక్కడ గతంలో ఈత కొట్టేందుకు వెళ్లిన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, నిజామాబాద్, ఆర్మూర్, ఆదిలాబాద్, మంచిర్యాల, హైదరాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన చాలామంది నీటమునిగి చనిపోయారు. ఒక్కో కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన సంఘటలున్నాయి. అందుకే భక్తులు జాగ్రత్తలు పాటించాలి.

బోర్డులు, జాలీలు ఏర్పాటు చేయాలి

ప్రమాదకర గుండాలున్నాయని దేవస్థానం వారు గోదావరి ఒడ్డున సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిని పరిశీలించని భక్తులు స్నానం చేసేందుకు ఎగువ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆయా గుండాల వద్ద సూచిక బోర్డులు, జాలీలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అంటున్నారు. ముఖ్యంగా భక్తులు స్నానాలు చేసే చోట నిఘా కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మాకు లోతు తెల్వదు



మాది పెగడపెల్లి మండలం దోమలకుంట. ప్రతీ సంవత్సరం గోదావరి స్నానానికి వస్తున్నం. మాకు ఇక్కడ లోతు ఎంతుంటదో తెల్వదు. బోర్డులు పెడితే బాగుంటది.

– లక్ష్మి, భక్తురాలు

లోపలికి పోతున్నరు



మాది మల్యాల మండలం. గోదావరి గుండాల కాడ స్నానం కోసం చాలామంది లోపలికి పోతున్నరు. ప్రమాదం జరగకముందే లోపలికి వెళ్లకుండా జాలీలు పెట్టాలి.

– విజయ, భక్తురాలు

ధీర వనిత కామ్రేడ్ కూర మల్లమ్మ

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క



నివాళి అర్పిస్తున్న విమలక్క, ఉద్యమకారులు

వేములవాడ: నిత్య నిర్బంధాల మధ్య దాదాపు నిండు నూరేళ్లు జీవించిన కామ్రేడ్ కూర మల్లమ్మ పోరాటవీరులకు జన్మనిచ్చిన మహాతల్లి అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క కొనియాడారు. వేములవాడ పట్టణంలోని మల్లమ్మ ఇంట్లో మంగళవారం ఆమె 5వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. మల్లమ్మ ఠాణాల చుట్టూ తిరిగినా ఏనాడూ తన పిల్లలకు లొంగిపోవాలని చెప్పని ధీర వనిత అన్నారు. చిన్న కొడుకు జైల్లో, పెద్ద కొడుకు అజ్ఞాతంలో ఉండగా భర్త బాలయ్య మరణిస్తే ఆయన చితికి నిప్పు పెట్టారని పేర్కొన్నారు. మల్లమ్మ యాదిలో అమర్ రాసిన పాటను పాడి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో శ్రామిక శక్తి రాష్ట్ర నాయకురాలు రాజేశ్వరి, రేవతి, పురుషోత్తంరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్సూర్, పోతుల రమేష్, రాకేశ్, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

తాహెర్‌కొండాపూర్‌లో శిక్షణ బృందం పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న శిక్షణ అధికారులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని తాహెర్‌కొండాపూర్‌లో మంగళవారం 5 జిల్లాల శిక్షణ అధికారులు పర్యటించారు. పారిశుధ్య కార్మికుల రక్షణ, భద్రత, గౌరవం, ఆరోగ్యం తదితర అంశాలపై కరీంనగర్‌లో రెండు రోజుల శిక్షణకు హాజరైన కొమురం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు యూనిసెఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ కిషన్‌స్వామి ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించారు. మరుగుదొడ్ల వినియోగం, మురికి కాల్వల నిర్వహణ, తడి, పొడి చెత్త తరలింపు, కంపోస్టు షెడ్డు నిర్వహిస్తున్న తీరు, అంగన్‌వాడీ కేంద్రం, నర్సరీలో మొక్కల పెంపకం, వైకుంఠధామం తదితరాలపై స్థానికులతో మాట్లాడారు. స్వచ్ఛత, పరిశుభ్రతలో తాహెర్‌కొండాపూర్ జిల్లాలోని మిగిలిన గ్రామాల కంటే ముందంజలో ఉందని తెలిపారు. అనంతరం చెర్లభూత్కూర్‌లో పారిశుధ్య కార్మికులను కలిసి, వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూనిసెఫ్ వాష్ కన్సల్టెంట్ ఫణీంద్రకుమార్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, సర్పంచు మడికంటి మమత, ఎస్‌బీఎం సభ్యులు రమేశ్, వేణు, ఫణి, హరిణి, సురేశ్, రాఘవులు పాల్గొన్నారు.

ఆటోలో ఆఫీస్‌కు వెళ్తూ.. కిందపడి

- యువకుడి మృతి
- పెళ్లయిన ఏడాదికే అనంతలోకాలకు..



సంతోష్ మృతదేహం

ధర్మపురి: ఆఫీస్‌కు వెళ్లేందుకు ఇంటినుంచి బయలుదేరిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి పడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన మ్యాన శంకర్–పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. చిన్న కొడుకు సంతోష్(27) వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఆటోలో ఆఫీస్‌కు వెళ్తుండగా బూరుగుపల్లె సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనంలో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తీసుకెళ్లి, చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు.

ఇటీవలే ఘనంగా పెళ్లిరోజు..

సంతోష్‌కు గతేడాది వెల్గటూర్ మండలంలోని కొత్తపేటకు చెందిన సుమలతతో వివాహం జరిగింది. ఇటీవలే పెళ్లిరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పెళ్లయిన ఏడాదికే అతను మృతి చెందడంతో భార్య, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆటోడ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా ఆటో నడపడం వల్లే సంతోష్ కిందపడ్డాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

వ్యక్తి దుర్మరణం



తిరుపతి మృతదేహం

జగిత్యాల క్రైం/ధర్మపురి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై సదాకర్ వివరాల ప్రకారం.. ధర్మపురి మండలంలోని దోనూర్‌కు చెందిన గొల్లెన తిరుపతి(37), అతని మిత్రుడు శివరాత్రి తిరుపతి సోమవారం బైక్‌పై జగిత్యాల వెళ్లారు. రాత్రి తిరిగి వస్తూ తిప్పన్నపేట శివారులో వాహనం ఆపగా, శివరాత్రి తిరుపతి మూత్ర విసర్జనకు వెళ్లాడు. గొల్లెన తిరుపతి బైక్‌పై ఉండగా ఓ కారు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

రుద్రంగి(వేములవాడ): బావిలో పడి ఓ గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన రుద్రంగి మండలంలోని మానాలలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచ్‌కుంద మండల కేంద్రానికి చెందిన భాగయ్య(24) తన గొర్రెలను మేత కోసం మానాలకు తీసుకువచ్చాడు. మంగళవారం జీవాలను మేపుతూ ప్రమాదవశాత్తు బావిలో పడి, మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చాక మృతదేహాన్ని వెలికితీయించి, పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చోరీలు చేస్తున్న యువకుల అరెస్టు

- 11 విద్యుత్ మోటార్లు, ఒక ట్రాక్టర్ ట్రాలీ స్వాధీనం



ట్రాలీ, మోటార్లను చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి: జల్సాలకు అలవాటు పడి, చోరీలు చేస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. మెట్‌పల్లి పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రవీందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్‌కు చెందిన గుగ్లావత్ నరేశ్, జరుపుల ప్రకాశ్, గుగ్లావత్ రవిలాల్, గుగ్లావత్ అనిల్ జల్సాలకు అలవాటుపడ్డారు. డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. గత నవంబర్ 10న గ్రామ శివారులో విద్యుత్ మోటార్లు చోరీ చేయడానికి వెళ్తుండగా ఓ ట్రాక్టర్ ట్రాలీ కనిపించడంతో తీసుకెళ్లి, పొదల్లో దాచిపెట్టారు. గడిచిన మూడు నెలల్లో ఆత్మకూర్‌తోపాటు జగ్గాసాగర్, రాఘవపేట, వెల్లుల్ల తదితర గ్రామాల్లో 11 విద్యుత్ మోటార్లను దొంగలించారు. వాటిని నిజామాబాద్‌లో విక్రయించడానికి మంగళవారం ట్రాలీలో తీసుకెళ్తుండగా జగ్గాసాగర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. మోటార్లను స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.

గల్ఫ్ వెళ్లొచ్చి.. తనువు చాలించి

- అప్పు తీర్చే మార్గం లేదు
- మనస్తాపంతో వలసజీవి ఆత్మహత్య
- ధర్మారంలో విషాదం



అంకూస్ మృతదేహం

జగిత్యాల క్రైం: ఊళ్లో పని లేదు.. ఉపాధి కోసం అప్పు చేసి, దేశాలు తిరిగాడు.. ఎక్కడా పని దొరకలేదు.. చివరికి స్వగ్రామం చేరాడు.. పనిలేక.. అప్పు తీర్చే మార్గం లేక తనువు చాలించాడు జగిత్యాల రూరల్ మండలం ధర్మారానికి చెందిన నేరెళ్ల అంకూస్(44). ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్సై సదాకర్ వివరాల ప్రకారం.. అంకూస్ జీవనోపాధి కోసం అప్పు చేసి, దుబాయ్ వెళ్లాడు. అక్కడ పని లేకపోవడంతో సౌదీ వెళ్లాడు. అక్కడి కంపెనీ జీతాలు ఇవ్వకపోవడంతో తిరిగి వచ్చాడు. మళ్లీ అప్పు చేసి, ఇరాక్ వెళ్లాడు. అక్కడా పని లేకపోవడంతో స్వగ్రామం చేరాడు. తనకు పని లేదని, అప్పు ఎలా తీర్చాలంటూ నిత్యం మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం లక్ష్మీపూర్ శివారులో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు ఎత్తివేస్తాం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల: కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులపై బీఆర్‌ఎస్ పార్టీ నమోదు చేయించిన పోలీస్ కేసులను ఎత్తివేయిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని లహరి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి జరిగిన సన్మాన సభలో మాట్లాడారు. కష్టకాలంలో పదేళ్లుగా పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలను కడుపులో పెట్టుకుని చూసుకుంటామన్నారు. సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ఎగువ మానేరును నింపే కాళేశ్వరం ప్రాజెక్టు 9వ ప్యాకేజీ పనులు ఎందుకు పూర్తి కాలేదని, మంత్రి కేటీఆర్ పదేళ్లుగా ఏం చేస్తున్నారని పొన్నం ప్రశ్నించారు. ప్యాకేజీ 10, 11, 12 పూర్తి అయితే.. ప్యాకేజీ–9 ఎందుకు పూర్తి చేయలేదన్నారు. సిరిసిల్ల నేతన్నలకు రూ.240 కోట్లు పెండింగ్ పెట్టిపోయిన ఘనుడు కేటీఆర్ అని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ సాధించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, కారు షెడ్డుకు పోయిందని, అది ఇక రాదన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ప్రజలు గుణపాఠం చెప్పినా కేటీఆర్‌లో ఇంకా అహంకారం తగ్గలేదన్నారు. సర్పంచ్‌లకు బిల్లులు ఇవ్వకుండా పెండింగ్ పెట్టాడన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె.మహేందర్‌రెడ్డి, నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, ప్రకాశ్, బాలరాజు, సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజు, నాగం కుమార్, శివప్రసాద్, వనిత, వెల్ముల స్వరూప, మడుపు శ్రీదేవి, టోనీ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

మంత్రిగా తొలిసారి సిరిసిల్లకు వచ్చిన పొన్నం, ఆది, మేడిపల్లి సత్యంలకు సిరిసిల్ల నేతన్న విగ్రహం వద్ద గజమాలతో స్వాగతం పలికారు. నేతన్న విగ్రహానికి పూలమాల వేసి ప్రదర్శనగా విద్యానగర్ చేరుకున్నారు.



మంత్రి పొన్నంను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

నందీశ్వర కాంప్లెక్స్ పైనుంచి కిందపడిన భక్తుడు

- తీవ్రగాయాలు.. ఆస్పత్రికి తరలింపు



కిందపడిన మహేందర్

వేములవాడ: రాజన్న దర్శనానికి వచ్చిన వరంగల్ జిల్లాకు చెందిన మహేందర్ మంగళవారం రాత్రి నందీశ్వర కాంప్లెక్స్ రెండో అంతస్తు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆలయ సిబ్బంది కథనం ప్రకారం.. ఈనెల 29న సోమవారం మహేందర్ కుటుంబసభ్యులతో కలిసి వేములవాడకు వచ్చారు. మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. అంతా సేదతీరుతున్న క్రమంలో రెండోఅంతస్తు ప్రహరీపై నుంచి మహేందర్ కిందపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో 108లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని ఆలయ వర్గాలు తెలిపాయి. మద్యం మత్తులోనే కిందపడిపోయినట్లు కాంప్లెక్స్‌లో ఉన్న భక్తులు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని ఆలయ ఎస్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ కుమారస్వామి, కాంప్లెక్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



స్వామివారి చిత్రపటం తీసుకువస్తున్న అర్చకులు, అధికారులు

వేములవాడ: వేములాడ రాజన్న సన్నిధిలో 5 రోజులపాటు జరిగే త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకులు పూజలు చేశారు. అనంతరం త్యాగరాజస్వామి వారి చిత్రపటాన్ని పురవీధుల గుండా సభావేదిక వద్దకు తీసుకొచ్చారు. స్థానిక సరస్వతి శిశుమందిర్ విద్యార్థినుల కోలాట విన్యాసాలు ఆకట్టుకున్నారు. ఉపన్యాసకుడు పాలెపు చంద్రశేఖర్ శర్మ త్యాగరాజస్వామి జీవిత విశేషాలు, జోత్స్న బృందంచే పంచరత్న గానం, స్వర్ణలత హరికథ, పద్మలత బృందంచే సంగీత కచేరి, గుమ్మడి జనార్దన్, వాణిలచే సితార సోలో కచేరి, ఉమాదేవి సంగీత కచేరి, మంగళంపల్లి స్వర్ణలత శాస్త్రీయ సంగీత కచేరి, రేఖ బృందం నృత్య ప్రదర్శన, దుర్గాభవాని నాట్య మండలి వారిచే నాటక కార్యక్రమాలు నిర్వహించాయి. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకుడు శంకర్, కళాకారులు పాల్గొన్నారు.



శిశుమందిర్ విద్యార్థినుల కోలాట ప్రదర్శన



హరికథ చెబుతున్న స్వర్ణలత

అంజన్న సేవలో భక్తజనం

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు మంగళవారం వేలాదిగా తరలివచ్చారు. కోనేరులో స్నానాలు చేసి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. తాగునీరు, పార్కింగ్ స్థలం లేక ఇబ్బంది పడ్డారు. ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాస శర్మ, సిబ్బంది అందుబాటులో ఉన్నారు.



ఆలయం ఎదుట భక్తుల సందడి



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



బేతాళస్వామి ఆలయంలో పూజలు